క్లుప్తంగా

అర్థశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ రాధిక



ప్రొఫెసర్ రాధికను అభినందిస్తున్న అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ అర్థశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ రాధిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2008లో అర్థశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిన ఆమె అంచెలంచెలుగా ఎదుగుతూ అనేక మంది విద్యార్థులకు పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులకు పరిశోధనా మార్గదర్శకురాలిగా పనిచేశారు. అలాగే బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యురాలిగా కూడా విశేష సేవలందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విభాగాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సునీత, అకడమిక్ కన్సల్టెంట్లు రమేష్, ప్రతాప్, శివ, కుమార్‌రాజా, గీత కుమారి, సుబ్రమణ్యం, పరిశోధక విద్యార్థులు ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు.

తిరుచానూరు పంచాయతీ ఈఓగా మణి



చంద్రగిరి: తిరుచానూరు పంచాయతీ కార్యదర్శిగా పీఎస్ మణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేణిగుంట పంచాయతీ ఈఓగా పనిచేస్తున్న ఆయనను రెగ్యులర్ పంచాయతీ ఈఓగా జిల్లా అధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుచానూరు పంచాయతీ అభివృద్ధితో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు.

తిరుపతి రూరల్ ఏఓగా సుబ్బారావు



తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం వ్యవసాయ శాఖ అధికారిగా ఏపీ సుబ్బారావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో వ్యవసాయ శాఖ అధికారిగా ఇక్కడ పనిచేస్తున్న మమత రామచంద్రాపురానికి బదిలీ అయ్యారు. నాగలాపురంలో పనిచేస్తున్న ఆయన తిరుపతి రూరల్ మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మర్యాద పూర్వకంగా ఉన్నతాధికారులను కలిసి పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన ప్రతి రైతు ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లి తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 3103 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించారని, అందులో 218మంది మాత్రమే ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు.

మహాభారత యజ్ఞ మహోత్సవం ప్రారంభం

పాకాల: మండలంలోని దామలచెరువు పంచాయతీ పోలిశెట్టివారిపల్లి భారతంమిట్టలో మహాభారత యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. సోమవారం తిరుపతికి చెందిన గానకోకిల హరికథ భాగవతారిణి ఉషారాణి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మహాభారత హరికథా గానం చేశారు. ఈ నెల 16 నుంచి జూలై 3వ తేదీ వకు పగలు హరికథా కాలక్షేపం, అదేవిధంగా జూలై 25వ తేదీ నుంచి రాత్రి నాటకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగుడికి చేయూత



దివ్యాంగుడికి ఫైబర్‌ఫుట్ అందిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: శ్రీకాళహస్తి మండలం ఆంజనేయపురానికి చెందిన సుబ్బరాయులుకు ఎంపీ లాడ్స్ ద్వారా హైడ్రాలిక్ జాయింట్ విత్ కార్బన్ ఫైబర్ ఫుట్ 5 సీల్ లైనర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అందజేశారు. సంగమేశ్వర హెల్త్ ఎయిడ్స్ అండ్ సర్జికల్ ఏజెన్సీ వారు తయారు చేసిన దీని విలువ రూ.5.70 లక్షలుగా తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాయులు ఆనందం వ్యక్తం చేశాడు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ బాలకృష్ణ నాయక్, ప్రతిభా వంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సీఆర్‌అండ్ఎం రాజశేఖర్, సంగమేశ్వర హెల్త్ ఎయిడ్స్ అండ్ సర్జికల్ ఏజెన్సీ నిర్వాహకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

హోమం టికెట్‌ల కోసం పాట్లు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అలిపిరి గోశాల వద్ద నిర్వహిస్తున్న హోమశాల వద్ద నిత్యం భక్తులు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారు. హోమం టికెట్ల కేటాయింపులో పారదర్శకత లోపించడంతో భక్తులకు కష్టనష్టాలు తప్పడం లేదు. టీటీడీ అధికార యంత్రాంగం పర్యవేక్షణ లేని కారణంగా ఇక్కడ హోమం టికెట్ల కేటాయింపు ప్రక్రియ భక్తులకు ప్రహసనంగా మారింది. సోమవారం నాడు ఉదయం అలిపిరి వద్ద హోమం టికెట్లను పొందడంలో తలెత్తిన ఇబ్బందులపై భక్తుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది.

విత్తనం.. పచ్చ పెత్తనం

వేరుశనగ విత్తనాల పంపిణీలో పచ్చనేతలు పెత్తనం చెలాయించారు. దీంతో సామాన్య రైతులకు విత్తనాలు అందలేదన్న విమర్శలు వస్తున్నాయి. విత్తనకాయల పంపిణీ ప్రారంభం రోజునే టోకెన్లన్నీ తెలుగు తమ్ముళ్ల జేబుల్లోకి చేరడంతో వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లిన సామాన్య రైతులు బిక్క ముఖం వేసుకుని ఒట్టి చేతులతో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అంతేకాకుండా వేరుశనగ విత్తనాల పంపిణీకి స్థానిక ప్రజా ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు ఎవరికీ సమాచారం ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- టోకెన్లన్నీ తెలుగు తమ్ముళ్ల జేబులోకి..
- అర్హులైన రైతులకు మొండిచేయి
- తొలిరోజే 400 క్వింటాళ్ల విత్తనకాయల పంపిణీ
- స్థానిక ప్రజా ప్రతినిధులకు అందని ఆహ్వానం
- టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి.. రైతులకు అన్యాయం చేసిన వ్యవసాయ అధికారులు



వేరుశనగ విత్తనకాయలను టీడీపీ సానుభూతి పరులకు మాత్రమే పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రామచంద్రాపురం మండలంలో చేపట్టిన విత్తనపంపిణీ అంతా కూడా రైతులకు అందించకుండా.. పచ్చనేతలు, అధికారులు కుమ్మక్కై వారి సానుభూతి పరులకు అందించేలా పన్నాగం పన్నారు. దీంతో అసలైన రైతులకు అన్యాయం జరిగింది. అసలే అరకొరగా విత్తనకాయలు రావడంతో రైతులు టెన్షన్ పడుతుంటే పచ్చనేతలు మాత్రం ఎవరెలా పోతే తమకేంటి ? అన్నట్లు వ్యవహరించారు. నిజమైన లబ్ధిదారులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసి ఆఖరు రోజున మిగిలిన వాటిని తమ్ముళ్లకు పంచాలని పథకం వేసినట్లు సమాచారం . అయితే అందుకు వారు అంగీకరించకపోవడంతో తొలిరోజే తెలుగు తమ్ముళ్లు, పార్టీ సానుభూతిపరులకు అత్యధికంగా పంపిణీ చేసి 400 క్వింటాళ్లను పంచేశారు అక్కడి టీడీపీ నేతలు. దీంతో సామాన్య రైతులు వేరుశనగ విత్తనాలు తమదాకా వస్తాయా ? అన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తొలిరోజే 400 క్వింటాళ్లు పంపిణీ..

మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో సోమవారం రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. తొలిరోజున 400 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనాలను రైతన్నలకు అందించిన ప్రభుత్వ అధికారులు అందులో సామాన్య రైతులకు కాకుండా తెలుగు తమ్ముళ్లకే అత్యధికంగా అందించడంపై పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 8 రైతు సేవ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా 30 కేజీల బస్తా వేరుశనగ విత్తనాలను రాయితీతో పంపిణీ చేస్తుండగా సామాన్యులకు మాత్రం విత్తనాలు అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. మండలం మొత్తం 399 క్వింటాళ్లు 1,331 బస్తాల వేరుశనగ విత్తనాలు వచ్చినప్పటికీ సామాన్య రైతులకు అందడం లేదని, అడ్డదారిలో టోకెన్లు పొంది రాయితీ విత్తనాలను తీసుకువెళ్లిన తెలుగు తమ్ముళ్లు పంటసాగుకు కాకుండా పచ్చళ్లకు వాడుకుంటున్నారనే విమర్శలు వినిస్తున్నాయి. విత్తనాల కోసం ఎదురుచూసే రైతులకు మాత్రం తొలిరోజు పంపిణీ సమయంలోనే అధికారులు, టీడీపీ నేతలు మొండిచేయి చూపించినట్టు సమాచారం. మండల వ్యవసాయ శాఖ అధికారి మమత అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకు రైతన్నలకు అన్యాయం చేశారన్న ఆరోపణలు లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రెండవ రోజు పంపిణీలో అయినా నిజమైన రైతులకు వేరుశనగ విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.



రైతు పేరు లేకుండానే వ్యవసాయ అధికారి పంపిణీ చేసిన టోకెన్లు

దోమల నివారణకు మందులు పిచికారీ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలోని మురుగునీటి కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయించాలని కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె నగరంలోని స్కావెంజర్స్ కాలనీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కావెంజర్స్ కాలనీలో డ్రైనేజీ కాలువలు, రోడ్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి ఉన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 43 వినతులు తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 43 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా 12 మంది తమ సమస్యలు తెలుపగా, 31 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఆయా సమస్యలను సంబంధిత విభాగాల అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని కమిషనర్ తెలిపారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞానకేంద్రం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఉపాధే లక్ష్యంగా వేమన విజ్ఞానకేంద్రంలో గత రెండు నెలలుగా నిర్వహించిన కంప్యూటర్ కోర్సుల శిక్షణా తరగతులు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 56 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రిన్సిపల్ పి.పంచముఖేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగంలో సామాజిక అభివృద్ధికి దోహదపడేలా వేమన విజ్ఞాన కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమైనవని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల ఉపాధికి తోడ్పడాలని కోరారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ ప్రస్తుతం వేమన విజ్ఞాన కేంద్రంలో అతి తక్కువ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ ఏసీ ల్యాబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ ఆఫీస్ బేసిక్ కంప్యూటర్స్, డీసీఏ, పీజీడీసీఏ, ట్యాలీ, సీసీ ప్లస్ ప్లస్, పైథాన్, జావా, ఏ1(ఆన్‌లైన్)డీటీపీ కోర్సుల్లో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. ఆసక్తిగల వారు కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడెన్స్ రాష్ట్ర నూతన కమిటీ

తిరుపతి సిటీ: హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడెన్స్ నేషనల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ యూత్ హాస్టల్‌లో సోమవారం హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025–2028 సంవత్సరానికి గానూ నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి హబీబ్ బాషా మాట్లాడుతూ కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు పేట్రన్‌గా బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. ప్రెసిడెంట్‌గా సింగూరు మోహన్‌రావు, చైర్మన్‌గా పుల్లూరు దయాకర్, సెక్రటరీగా బానా నాగేశ్వరరెడ్డి, ట్రెజరర్‌గా బీఎస్ చంద్రమౌళేశ్వర రావు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే చీఫ్ కమిషనర్‌గా మురళినాయుడు, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్‌గా తుంగ శ్రీకాంత్‌ను ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. వీరితో పాటు మరికొందరు కార్యవర్గంలో వివిధ హోదాల్లో ఎంపికయ్యారని రాష్ట్రంలోని స్కౌట్ అండ్ గైడెన్స్ అభివృద్ధికి తోడ్పడేందుకు కృషి చేసేందుకు కంకణబద్ధులు అవుతారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అతుల్ కుమార్ సోధాని, రఘువీర్ చౌదరి, వెంకట అప్పల నాయుడు, సిడగ రోహిణి, సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

చంద్రగిరి : మండలంలోని మిట్టపాళెం పంచాయతీ శ్రీనివాసమంగాపురంలో తమ పూర్వీకులు నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయంలోకి వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు తమకు న్యాయం చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ తరతరాలు తాము పూజించుకునే అమ్మవారి ఆలయానికి కొన్నేళ్ల క్రితం కొందరు సిక్కులు వచ్చారన్నారు. ఇంటి దైవంగా భావిస్తామని, తాము ప్రత్యేక పూజలు చేసుకునేందుకు అనుమతించాలని కోరడంతో మేము కూడా ఒప్పుకున్నామన్నారు. ఇదే అలుసుగా తీసుకుని సిక్కులు క్రమేణా అమ్మవారి ఆలయ నిర్వహణ బాధ్యతలను చేజిక్కించుకున్నారని, ఇప్పుడు తమనే ఆలయంలోకి అనుమతించడం లేదని వాపోయారు. దీనిపై పలువురు పెద్దలు మధ్యస్తం చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. చివరకు సదరు సిక్కులు కోర్టును ఆశ్రయించి తమకు నోటీసులు జారీ చేయించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

బాధ్యతగా పని చేయండి



కలెక్టర్‌ను కలిసిన జేసీ శుభం బన్సల్ , పరిశ్రమలశాఖ జీఎం చంద్రశేఖర్ , భూగర్భజలాలశాఖ అధికారి శోభనబాబు , డీఐపీఆర్వో గురుస్వామి శెట్టి (కుడి నుంచి ఎడమకు)

తిరుపతి అర్బన్: కొత్తగా జిల్లాకు వచ్చిన అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాద పూర్వకంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను పలువురు కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా తుడా వీసీగా అదనపు బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తోపాటు జిల్లా పరిశ్రమలశాఖ జీఎం చంద్రశేఖర్, భూగర్భజలాలశాఖ డీడీ శోభన్‌బాబు, సమాచార విభాగానికి సంబంధించి డీఐపీఆర్ఓ పి.గురుస్వామి శెట్టి, డీపీఆర్ఓ రమేష్‌బాబు కలెక్టర్‌ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయడంతో పాటు జిల్లా అభివృద్ధికి అంతా కృషి చేయాలని సూచించారు.

ఇది ముంచే ప్రభుత్వం

- '5 కోట్ల మందికి వెన్నుపోటు' పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి రోజా



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి రోజా

నగరి : 'కూటమి నాయకులు మాది మంచి ప్రభుత్వం అంటూ డప్పు కొట్టుకుంటుంటే.. ప్రజలు మాత్రం ఇది ముంచే ప్రభుత్వం అంటున్నారు' అని మాజీ మంత్రి ఆర్కేరోజా ఎద్దేవా చేశారు. నగరి పట్టణంలోని తన నివాసంలో సోమవారం '5 కోట్లమందికి వెన్నుపోటు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబుకు అబద్ధాలు చెప్పడం, వెన్నుపోటు పొడవడం అనేది వెన్నతో పెట్టిన విద్య అని ముక్త కంఠంతో జనం చెబుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఇస్తామని ఏడాదైనా సూపర్ సిక్స్ పథకాలు అమలు లేదన్నారు. నిరుద్యోగ భృతి లేదు, మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్ లేదు, ఉచిత బస్సు లేదు. 18 యేళ్ల దాటిన మహిళలకు నెలకు రూ.1500 లేదు, ఇప్పటి వరకు ప్రజలకు సెంటు భూమి ఇవ్వలేదని గుర్తుచేశారు. వైఎస్ జగన్ పొదిలి పర్యటనలో జన తాకిడి చూసిన తర్వాత భయపడి తల్లికి వందనం హడావుడిగా విడుదల చేశారన్నారు. అది కూడా 87 లక్షల మందికి అందాల్సిన పథకం కేవలం 57 లక్షల మందికి మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఒకే ఆధార్ నెంబర్‌తో 349 మందికి, 54 మందికి, 92 మందికి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాల్లో చదివే విద్యార్థులను అనర్హత కింద పరిగణించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.వెయ్యి తీసుకుంటే రాద్ధాంతం చేసిన చంద్రబాబు, నేడు రెండు వేలు వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మూలన ఉండే ముసలమ్మ కూడా బలన్ నొక్కుతుందన్న చంద్రబాబు ఒక్క బటన్ నొక్కడం కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టే రెడ్ బుక్ రాజ్యాంగం పక్కన పెట్టి..ఎల్లో మేనిఫెస్టో అమలు చేయాలని హితవు పలికారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ పెరిగిపోయాయని వాటిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, మున్సిపల్ వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో గత మూడు నెలలుగా ఏ వన్ సర్వీసులో పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు రుయా సూపరింటెండెంట్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కొట్టుమిట్టాడుతున్న కార్మికులకు ఏ వన్ కాంట్రాక్ట్ సంస్థ మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం, వేతనాలు పెంచకపోవడంతో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ హాకర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బుజ్జి, కార్మికులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



తిరుపతి తుడా: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రతి వ్యక్తి యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు పిలుపునిచ్చారు. సోమవారం కళాశాలలోని ఇందిరాబాయి ఆడిటోరియంలో యోగాంధ్రలో భాగంగా వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది కలసి యోగాసనాలను ప్రాక్టీస్ చేశారు.

సంక్షేమ పథకాలు ఇవ్వండి

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ స్కూళ్లలో పనిచేస్తున్న వర్కర్లు, హెల్పర్లకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తిరుపతి నగర అధ్యక్షుడు సుజాత, కార్యదర్శి నాగరత్న డిమాండ్ చేశారు. ఆ మేరకు తిరుపతి ఆర్డీఓ ఆఫీస్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి.. ఆ స్థాయిలో జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల నేత నిర్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మహిళ మెడలో చైను చోరీ

తిరుపతి క్రైం : ఇన్సూరెన్స్ చేయిస్తామని నమ్మించి ఇంట్లోకి దూరి మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బ్లిస్ హోటల్ వెనుక వైపు ఉన్న జయనగర్‌లో ఓ ప్రైవేట్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న వసంత ఇంటికి ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. మేడం ఇన్సూరెన్స్ కావాలా అని మాటలు కలిపాడు. ఇంతలో అకస్మాత్తుగా మహిళ మెడలో ఉన్న చైన్లు లాక్కుని పారిపోయాడు. ఆ చైను సుమారు 40 గ్రాములు ఉంటుందని మహిళ ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి పియూష్ గోయల్, మాజీ మంత్రి రోజాతో కలసి నటి మీనా, మరో నటి ఇంద్రజ వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న కేంద్ర మంత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్, రాష్ట్ర మంత్రులు అనగాని, టీజీ భరత్ స్వాగతం పలికారు. అనంతరం అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్థంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

నోటీస్ బోర్డు

- గంగమ్మ మరుపొంగళ్లు వేడుకల్లో భాగంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వనున్న గంగమ్మ తల్లి
- యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై సీపీఎం నేతల మీడియా సమావేశం
- తిరుచానూరులోని శ్రీసుందరరాజస్వామి ఆలయంలో స్వామివారి అవతారోత్సవాలు ప్రారంభం
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న విష్ణునివాసం, అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ
- జిల్లాలోని 8 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శతావధాని ఆముదాల మురళిచే శ్రీమద్భాగవత సప్తాహం

తుడా వీసీగా శుభం బన్సల్ బాధ్యతల స్వీకరణ



జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి తుడా: తుడా (తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ) వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, సీపీఓ దేవికుమారి, ప్లానింగ్ అధికారి వాసుదేవ నాయుడు, ఎంఈ రవీంద్రయ్య తదితరులు వీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తిరుపతి రూరల్ డిప్యూటీ ఎంపీడీఓగా దయాసాగర్



తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం డిప్యూటీ ఎంపీడీఓగా దయాసాగర్ సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. వడమాలపేట మండలం నుంచి బదిలీపై వచ్చిన ఆయన ముందుగా ఎంపీడీఓ రామచంద్రను కలిసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌కు చేరుకున్న ఆయనను కార్యాలయ సిబ్బంది పరిచయం చేసుకున్నారు. ఆ తరువాత జిల్లాస్థాయి అధికారులను కలవడానికి బయలుదేరి వెళ్లారు. గతంలో ఇదే మండలంలో పంచాయతీ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం ఉండడంతో పలువురు పంచాయతీ కార్యదర్శులు కూడా ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

వలస కూలీ మృతి

తిరుపతి రూరల్ : నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనంపై నుంచి మత్తులో జారిపడిన వలస కూలీ మృతి చెందిన సంఘటన సోమవారం తిరుపతి శివార్లలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ వైకుంఠపురంలో నిర్మాణంలో ఉన్న 5 అంతస్తుల భవనంలో బిహార్ రాష్ట్రానికి చెందిన మంతుషా, అతని బావమరిది సత్యేంద్రకుమార్‌షాతో పాటు మరికొంత మంది పని కోసం వచ్చారు. వీరు ఆ భవనం పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఆదివారం పని ముగిసిన తరువాత సత్యేంద్రకుమార్ సహచరులతో కలసి మద్యం సేవించాడు. అర్ధరాత్రి దాటిన తరువాత వారికి కేటాయించిన వసతి గదిలో కాకుండా సత్యేంద్ర కుమార్ మద్యం మత్తులో 5వ అంతస్తులోని లిఫ్ట్ రూమ్‌పైకి ఎక్కి పడుకున్నాడు. అయితే మద్యం మత్తులో ఉన్న అతను పొరపాటున జారి కింద పార్క్ చేసిన బైక్‌పై పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో సమీపంలో నివాసం ఉన్న సునీల్‌కుమార్ బయటకు వచ్చి చూసి.. భవనంలోని కూలీలకు సమాచారం ఇచ్చాడు. అతని కారులోనే రుయా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు చనిపోయినట్టు నిర్ధారించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ షెక్షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.